రీచార్జి చేయకుంటే చీకటే !


- మాన్యువల్ విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- బిల్లుల స్థానంలో ప్రీపెయిడ్ విధానం
- తొలుత ప్రభుత్వ, వ్యాపార సంస్థల్లో ఏర్పాటు .. త్వరలో గృహాలకు సైతం..
- పేద, మధ్యతరగతి వర్గాలకు తప్పని కష్టాలు

సత్తెనపల్లి: విద్యుత్ శాఖ మాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పనుంది. సెల్‌ఫోన్ ప్రీపెయిడ్ రీఛార్జ్ మాదిరిగానే ఇకపై రీఛార్జి చేసుకుంటేనే ఇంటిలో విద్యుత్ వెలుగులు ఉంటాయి. మన ఖాతాలో డబ్బులు లేకపోతే వెంటనే కరెంట్ కట్ అవుతుంది. విద్యుత్ ఛార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్ లోకి మారిపోతుంది. దీనిలో భాగంగా బ్యాలెన్స్ ఉన్నంతవరకు మాత్రమే విద్యుత్ ఉంటుంది. ఆపై ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. రీఛార్జ్ అయిపోతే చీకటిలో మగ్గాల్సిందే.

ప్రస్తుత విధానమే మేలు...

సాధారణంగా నెలలో వినియోగించిన విద్యుత్ బిల్లు మరుసటి నెలలో చెల్లిస్తుంటారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో వినియోగదారుడు బిల్లు చెల్లించడానికి నెల వరకు సమయం ఉంటుంది. ఇంతవరకు అనుసరిస్తున్న ఈ విధానం వినియోగదారుడికి సౌకర్యంగానే ఉంది. అయితే ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుంది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందు గానే రీఛార్జ్ చేసుకోవాలి. ఇప్పటికే సత్తెనపల్లి పట్టణంలోని 340 ప్రభుత్వ కార్యాలయాలకు, సచివాలయాలు, వీధిలైట్లకు స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ ఏర్పాటు చేసింది. ఇవి కాక మరో 1,300 వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు.

ఇకపై 'స్మార్ట్' బాదుడు





పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌కు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

త్వరలో అందుబాటులోకి యాప్...

గతంలో ఉన్న మాన్యువల్ మీటర్లను చూసి ఎంత విద్యుత్ వినియోగించామో రీడింగ్ రాసుకునేవారు. దీని ద్వారా వినియోగదారునికి బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లకు రీడింగ్ తీయాల్సిన అవసరం లేదు. మొబైల్ రీఛార్జ్, డిష్ టీవీలకు రీఛార్జ్ విధానంలోనే స్మార్ట్ మీటర్లకు రీఛార్జ్ చేసుకోవాలి. ఇందుకు త్వరలోనే యాప్ అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అలసత్వం వహిస్తే ఆగిపోతుంది..

అవగాహన లేమితో రీఛార్జి చేసుకోవడంలో వినియోగదారుడు ఏమాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బకాయిల బాధ, విద్యుత్ చౌర్యం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా విద్యుత్ స్తంభాల లైన్‌ల నుంచి విద్యుత్తును అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ డివిజన్‌లో విద్యుత్ కనెక్షన్‌ల వివరాలు..

గృహ విద్యుత్ సర్వీసులు	98,500
వ్యవసాయ సర్వీసులు	9,600
వాణిజ్య సర్వీసులు	10,200
ఇండస్ట్రీయల్ సర్వీసులు	1200
ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులు	365

రాత్రివేళ రీఛార్జ్ అయిపోతే..



ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో ఛార్జ్ అయిపోతే ఎలా? గ్రామీణులకు రీఛార్జి చేయడం తెలియదు. రాత్రంతా చీకట్లో ఉండాల్సిందే. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలి.

–కాల్వపల్లి రమేష్‌రెడ్డి, పాకాలపాడు

గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు



గ్రామీణ ప్రజలకు స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి రీఛార్జ్ అయిపోతే అంధకారంలో ఉండాల్సిందే. రీఛార్జి చేయాలంటే సెల్‌ఫోన్ దుకాణానికి వెళ్లాలి. అదే పట్టణంలో అలాంటి పరిస్థితులు ఉండవు.

–నల్లబోతు శివనారాయణ, రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్, దూళ్ళిపాళ్ల

క్లుప్తంగా

టెన్నిస్‌లో క్రీడాకారులు రాణించాలి



సత్తెనపల్లి: క్రీడాకారులు నిత్యం తర్ఫీదు పొంది టెన్నిస్ క్రీడలో రాణించాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. టెన్నిస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫీస్ క్లబ్, శిశుమందిర్ సంయుక్తంగా నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్-2025 పోటీలకు సహకరించిన సుధీర్ భార్గవ్ రెడ్డిని గురువారం క్రీడాకారులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. అనంతరం ఆయనను దుశ్శాలువా, మెమంటోతో సత్కరించారు. టెన్నిస్ స్పోర్ట్స్ అసోసియేషన్ బాధ్యులు కె.కోటిరెడ్డి, సుధీర్, రవిశంకర్, తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ...

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం మాజీ సర్పంచ్ బండి కోటినాగిరెడ్డిని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ జి.సుధీర్ భార్గవ్‌రెడ్డి బుధవారం రాత్రి ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల కాలంలో మాజీ సర్పంచ్ కాలికి ఫ్రాక్చర్ కావడంతో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అనుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ శివకు కాలు ఫ్యాక్చర్ కావడం, కాలికి ఆపరేషన్ చేయడంతో ఆయన నివాసంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, సర్పంచ్ సానికొమ్ము వెంకటసుబ్బమ్మశ్రీనివాసరెడ్డి, తోట రఘునాధ్‌రావు, కారుమంచి మస్తానయ్య, అన్నపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, అన్నపురెడ్డి శివశంకరరెడ్డి, మన్నెం సతీష్, కారుమంచి శ్రీను తదితరులు ఉన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



క్రోసూరు: తల్లిదండ్రులు వారి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. గురువారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 12 మంది విద్యార్థులకు రిఫర్ చేయగా వారిని నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచిత వైద్యపరీక్షలు చేయించి, మందులు ఇప్పించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శ్యాంసన్ విద్యార్థుల తల్లిదండ్రులతో శ్యాంసన్ మాట్లాడుతూ పిల్లల కౌమారదశలో వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ఆర్బీఎస్‌కే పథకంలో ఉచితంగా విద్యార్థుల ఆరోగ్యపరీక్షలు, అవసరమైన వారికి పెద్ద ఆసుపత్రికి పంపించి అక్కడ చికిత్సలు అందిస్తుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



సత్తెనపల్లి: స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాన్ని చేపతబట్టి ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమను, ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

నరసరావుపేట రూరల్: తనపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయకుండా రూరల్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యల్లమంద పంచాయతీ పరిధిలోని కె.ఎస్.పి. కాలనికి చెందిన అన్నపురెడ్డి మంగయ్య తెలిపాడు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెల 3వ తేదీన పట్టణం నుంచి ఇంటికి వెళ్తున్న తనపై నలుగురు వ్యక్తులు విద్యానగర్‌రోడ్డులో దాడి చేశారని తెలిపాడు. కర్రలతో దాడి చేయడంతో కాళ్లు, చేతులు విరిగాయని, తీవ్ర గాయాలతో సుస్మిత ఆర్థో అండ్ ట్రామా కేర్‌లో చేరిన తనకు రెండు శస్త్ర చికిత్సలు జరిగాయని వివరించారు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని తెలిపారు. దీనిపై రూరల్ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. రూరల్ పోలీసులను న్యాయం చేయాలని కోరితే వారి నుంచి నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం చెబుతున్నారని వాపోయాడు. ఇప్పటికీ గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంటి వద్ద తిరుగుతూ భయాందోళనలు కలిగిస్తున్నారని తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలిపాడు.

నియోజకవర్గ స్థాయి వ్యాసరచన పోటీలు

200 మంది విద్యార్థులు హాజరు



పెదకూరపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, పాటల పోటీలను పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. క్విజ్ పోటీలలో షేక్ అఫ్రోజా, ఆసిఫా తపుసం, వకృత్వ పోటీలలో దివ్యశ్రీ, వ్యాసరచన పోటీలలో షేక్ సమీరా భాను, సాయి ప్రియ, జ్యోతిక బాయి, బ్లెస్సీలు ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎంఈఓ సత్యనారాయణ బహుమతులను అందించారు. పాఠశాల హెచ్‌ఎం కేవీ రమణ, సీనియర్ ఉపాధ్యాయులు కాసు నాగభూషణ్ రెడ్డి, దయామణి, రజియా, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వం అందించే సౌకర్యాలతో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందని ఎస్ఆర్‌పీ జె.ఎస్.రాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన నూజెండ్లలోని జిల్లా పరిషత్, కస్తూరిబా గురుకుల పాఠశాల్లో సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలు రూపకల్పనకు విద్యార్థులు తల్లిదండ్రులు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన రికార్డులు, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

•ఆటో..ఇటో అయితే..!



సత్తెనపల్లి పాతబస్టాండ్ సెంటర్‌లో ఆటోలో ప్రమాదకరంగా కూలీలను తరలిస్తున్న దృశ్యం



రైల్వేస్టేషన్ రోడ్ సమీపంలో ఆటో వెనుక నిలబడి ప్రమాదకరంగా వెళుతున్న యువతి

రహదారి భద్రతా వారోత్సవాలు తూతూమంత్రంగా మారాయి. కొందరు యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లొదులుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో ఆటోలో 20 మందిని పైగా కుక్కేస్తూ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ చోద్యం చూస్తున్నారు. - సత్తెనపల్లి

పింఛన్‌దారుల ఆరోగ్య స్థితిగతుల పరిశీలన



ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో మంచానికే పరిమితమై పింఛన్‌దారులను గురువారం పరిశీలించారు. మండలంలో ఆయా గ్రామాల్లో మంచానికే పరిమితమైన పింఛన్‌దారులు 25 మంది ఉన్నారని, ఆ మేర వారి ఇంటికి వెళ్లి వారి అర్హత ధ్రువీకరణ పత్రాలు, వారి స్థితిగతులను, ఆరోగ్య సమస్యలను పరిశీలించటం జరిగిందని ఎంపీడీఓ పీజే విలియమ్స్ చెప్పారు. ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి, గుంటూరుకు చెందిన వైద్యుడు నాగార్జున(ఆర్థోపెడిక్), డాక్టర్ సత్యనారాయణ(జనరల్), ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న అంబేడ్కర్ జీవిత చరిత్రపై పుస్తకావిష్కరణ

నాదెండ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ఆవిష్కరించనున్నట్లు హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు చెప్పారు. సాతులూరు గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, పలువురు హాజరుకానున్నట్లు చెప్పారు.

శాంతి చర్చలు జరపాలి

నరసరావుపేట: దండకారణ్యంలో జరుగుతున్న భద్రత బలగాల దాడులు నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలు చేసి మధ్యభారతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలో పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు మీడియాతో మాట్లాడుతూ 2024 జనవరి నుంచి నేటివరకు 300 మందికి పైగా ఆదివాసులు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని అన్నారు.

26న రైతాంగ సమస్యలపై ర్యాలీ



మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

క్రోసూరు: ప్రధాని నరేంద్రమోదీ 2020లో రైతాంగపోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా ఈనెల 26వ తేదీన ర్యాలీకి రైతుసంఘం పిలుపుచ్చింది.

గురువారం ఈ మేరకు క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ పోరాట సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా కిసాన్ మోర్చా (ఆల్ ఇండియా రైతు సంఘాల సమన్వయ కమిటీ) ఆధ్వర్యంలో ఈ 26వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు.

అందులో భాగంగానే పల్నాడు జిల్లాలో కూడా రైతాంగ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన ర్యాలీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు, అచ్చంపేట రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ళ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ



విష్ణువర్ధన్ రాజును అభినందిస్తున్న కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వివిధ పోటీల్లో పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయ ఓటరు దినోత్సవ సంబరాల్లో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గ పాఠశాల స్థాయిలో సుగాలి కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన విద్యా, సాంస్కృతిక పోటీల్లో ప్రగతి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చిత్రలేఖనంలో జె.శృతి ప్రథమ స్థానం, క్విజ్‌లో ఎస్.భవిత, ఆర్.లాస్య ప్రథమ స్థానం, స్కిట్‌లలో మొదటి బహుమతులు సాధించి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు గురువారం అభినందించారు. అలాగే పరీక్ష పే చర్చ కార్యక్రమం సందర్భంగా కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాలలకు నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రగతి సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ఎస్.విష్ణువర్ధన్ రాజు (ప్రథమస్థానం), షేక్ జానీబాషా (తృతీయ స్థానం) సాధించారు. సూర్యదేవర శ్రీనివాసరావు అభినందించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్



పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న శశికుమార్

సత్తెనపల్లి: జిల్లాలో భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశి కుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం శశికుమార్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. ఆ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి అందరూ తోడ్పడాలన్నారు. పార్టీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు శశికుమార్‌ను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కట్టా శంకరరావు, పట్టణ అధ్యక్షుడు కందకట్ల శంకరరావు, మండల అధ్యక్షుడు గంటా విజయభాస్కర్ రెడ్డి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల అధ్యక్షులు తులసీరామ్, ముప్పాళ్ళ రామారావు, షేక్ మున్వర్ బాజీ, పులిపాటి శ్రీరామూర్తి, నోముల వెంకటచలపతిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండూరులో పశు వైద్యశిబిరం



కొండూరులో పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ స్వాతీదేవి

అచ్చంపేట: పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొండూరులో గురువారం వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 150 పశువులకు, 180 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 3000 జీవాలకు బొబ్బర్ల వ్యాధి నివారణకు టీకాలు వేశారు. 30 గేదెలకు సాధారణ, గర్భకోశవ్యాధి నివారణ వ్యాక్సిన్ ఇచ్చారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే పాలదిగుబడులు పెంచుకోవచ్చని డాక్టర్ స్వాతీదేవి పశుపోషకులకు సూచించారు. పశుపోషకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు, తొండపి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన శిబిరంలో 43 పశువులకు సాధారణ చికిత్సలు, 23 పశువులకు గర్భకోశ పరీక్షలు, 19 కృత్రిమ గర్భధారణ, 450 గొర్రెలకు బొబ్బర్ల టీకాలు, 520 గొర్రెలకు నట్టల నివారణ మందు అందించినట్లు మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి తెలిపారు. పశుపోషకులకు మందులను అందించారు. ఆయా గ్రామాల పశుసంవర్ధకశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద నెమలిపురిలో...

రాజుపాలెం: మండలంలోని పెద నెమలిపురి గ్రామంలో పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పశువైద్యాధికారి కె.నాగేశ్వరరావు వైద్య సేవలను అందించారు. 22 పశువులకు సాధారణ చికిత్సలు, 12 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 12 పశువులకు చూడు పరీక్షలు, 80 పశువులకు ,60 దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ, 2500 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ, 2500 గొర్రెలకు, మేకలకు బొబ్బర్లు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది జె.మల్లిఖార్జునరావు, హానోక్, ఇందు, తేజ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో..

క్రోసూరు: అనంతవరం, ఊటుకూరు, విప్పర్ల గ్రామాల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. 33 పశువులకు సాధారణ, 49 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 426 గేదెలకు, 1,355 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు తెలిపారు. మొత్తం 1,863 పశువులకు వైద్యచికిత్స అందించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థి సత్తా



బహుమతి అందుకుంటున్న జేఎన్‌వీ విద్యార్థి జి.లక్ష్మీమణికంఠ

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని క్విజ్ పోటీల్లో సత్తా చాటాడని ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు తెలిపారు. సత్తెనపల్లిలోని పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో గురువారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. పల్నాడు జిల్లాలో సీబీఎస్ఐ సిలబస్ బోధించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరీక్షా పే చర్చ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాఠశాల లో 9వ తరగతి విద్యార్థి గోలి లక్ష్మి మణికంఠ ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి కేవీ ప్రిన్సిపాల్ జగదీష్ గుప్తా చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి లక్ష్మీమణికంఠతో పాటు విద్యార్థికి శిక్షణ ఇచ్చిన జేఎన్‌వీ భూగోళశాస్త్రం అధ్యాపకులు ఎం లక్ష్మణరావును ప్రిన్సిపాల్‌తో పాటు మిగిలిన అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవటానికి నియమ నిబంధనలు పాటించక పోవటమే ప్రధాన కారణమని ట్రాఫిక్ సీఐ సిహెచ్ లోకనాథం అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రోడ్ సేఫ్టీ కార్యాలయంలో ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యర్థులకు గురువారం ''రోడ్డు ప్రమాదాలు వాటి నివారణ'' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, విశ్రాంతి లేకుండా ఎక్కువ దూరం వాహనం నడపడం, వ్యతిరేక దిశలో ప్రయాణించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, అతివేగం, చుట్టూ వున్న వాహనాలను గమనించక పోవ డం వలన రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బాధితులకు తగిన ధైర్యం చెప్పి, క్షతగాత్రులకు త్వరితగతిన వైద్యసహాయం అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.